విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 14 జులై 2024 8

తిరుపతి జిల్లా ఎస్పీగా ఎల్.సుబ్బరాయుడు

విశాలాంధ్ర -తిరుపతి : తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా ఎల్ సుబ్బరాయుడు నియమితులయ్యారు. శనివారం రాష్ట్రంలో పలువురు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా తిరుపతి ఎస్పీగా పని చేస్తున్న హర్షవర్ధన్ రాజును కడప జిల్లా ఎస్పీగా బదిలీ చేసింది. ఆయన స్థానంలో నూతన ఎస్పీగా ఎల్ సుబ్బరాయుడును ప్రభుత్వం నియమించింది. ఎస్పీ బాధ్యతతో పాటు తిరుపతి ఎర్రచందనం టాస్క్ ఫోర్స్ ఎస్పీగా సైతం అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తారు. ఈయన ఇటీవల తెలంగాణ నుండి ఏపీకి మూడేళ్ల కాలానికి అంతర్రాష్ట్ర డిప్టేషన్ పై వచ్చారు. త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

భలే రా'బడి'

- 'ప్రైవేటు'లో ఫీజుల దందా
- ప్రత్యేక సిలబస్ పేరుతో పుస్తకాల మోత
- ఒలంపియాడ్, ఈ-టెక్నో పేరుతో దోపిడీ
- ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు

విశాలాంధ్ర - తొట్టంబేడు :

విద్య వ్యాపారంగా మారిపోయింది. పేద, మధ్య తరగతి వారు చదువు 'కొన'లేని పరిస్థితి ఏర్పడింది. పిల్లలకు నాణ్యమైన చదువు కోసం చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేటు బడులను ఆశ్రయిస్తున్నారు. ఒలంపియాడ్, ఈ-టెక్నో, ఐఐటీ తదితర పేర్లతో వారు రూ.వేలకు వేలు ఫీజు వసూలు చేస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. అన్నీ తెలిసినా... విద్యాశాఖ అధికారులు మాత్రం 'మామూలు'గా తీసుకుంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు.నేడు చదువుపై అందరికీ ఆసక్తి పెరిగింది. తమలా కష్టాలు పడకూడదని... నాలుగు అక్షరాలు నేర్పిస్తే వారికి మెరుగైన భవిష్యత్తు ఉంటుందని తల్లిదండ్రుల ఆశ. తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించడానికి చాలా మంది తల్లిదండ్రులు ప్రైవేటు బడులను ఆశ్రయిస్తున్నారు. కార్పోరేటు విద్యా సంస్థలు తల్లిదండ్రుల ఆశలను 'క్యాష్' చేసుకుంటున్నాయి. అందుకే కార్పోరేటు బడుల్లో పదవ తరగతి పూర్తయ్యేలోగా సుమారు రూ.10లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

2

ఏపీని గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తాం

- త్వరలో యాంటీ నార్కొటిక్స్ టాస్క్ ఫోర్స్ టీం
- ఎర్రచందనం స్మగ్లింగ్‌ను పూర్తి స్థాయిలో అడ్డుకుంటాం
- పోలీసులకు త్వరలో పదోన్నతులు

: డీజీపీ ద్వారకా తిరుమలరావు

"ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తాం. గంజాయి సమాచారం ఇవ్వడానికి ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరు అందుబాటులోకి తెస్తున్నాం. రాష్ట్రంలో త్వరలో యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేస్తాం. ఎర్రచందనం స్మగ్లింగ్ ను పూర్తి స్థాయిలో అడ్డుకుంటాం. కేంద్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన నూతన చట్టాలపై అవగాహన కల్పిస్తున్నాం. పోలీసుశాఖలో త్వరలో పదోన్నతులు కల్పిస్తాం" అని ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు చెప్పారు. తిరుపతి పోలీసు అతిథి గృహం కాన్ఫరెన్సు హాలులో శనివారం ఆయన అనంతపురం, కర్నూలు రేంజ్ ఎస్పీలతో నేర సమీక్ష నిర్వహించారు.

వార్త మెయిన్‌లో

శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా దర్శనం, వసతి

మధ్యవర్తులు, దళారీల బెడద లేకుండా చర్యలు

- ఇకపై ఆధార్‌తో శ్రీవారి సేవలు కల్పించేందుకు ప్రయత్నాలు : టీటీడీ

విశాలాంధ్ర - తిరుమల : దేశ విదేశాల నుండి ప్రతిరోజు తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు టీటీడీ కల్పిస్తున్న దర్శనము, వసతి తదితర సేవలు దళారుల ప్రమేయం లేకుండా, మరింత పారదర్శకంగా నేరుగా అందించేందుకు టీటీడీ చర్యలు తీసుకుంది.ఇందులో భాగంగా టీటీడీ భక్తులకు ఆఫ్‌లైన్ (కౌంటర్ సేవలు) మరియు ఆన్‌లైన్ (వెబ్ పోర్టల్) రెండింటిలోనూ అందించే సేవలను అనేక మంది

2

జూలై 16న శ్రీవారి ఆలయంలో బ్రేక్ దర్శనాలు రద్దు 8

కాలువ ఆక్రమణలు తొలగించాలి

- సిపిఐ నేతలు డిమాండ్

విశాలాంధ్ర -చిత్తూరు : చెరువులు, కుంటలు ఆక్రమణలపై చర్య తీసుకోవాలని సిపిఐ నేతలు నాగరాజ్,జనార్ధన్‌లు డిమాండ్ చేశారు. పుంగనూరు సమీపంలోని తీగలమ్మ చెరువు మరవ కాలవను కలిపేసుకుని వెంచర్ వేసిన మాజీ ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి నిర్వాకం పై తగు చర్యలు తీసుకోవాలని శనివారం చిత్తూరు యస్. ఈ,కార్యాలయంలో సిపిఐ కార్యదర్శి ఎస్. నాగరాజు సహాయ కార్యదర్శి డా/టి. జనార్ధన్ నేతృత్వంలో ఇరిగేషన్ అధికారులకు వినతి పత్రం సమర్పించారు.

2లో

అద్దె ట్రాక్టర్లు ఎక్కడ?

- గ్రామాల్లో కనబడని రోజువారి అద్దె వ్యవసాయ పనిముట్లు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

విశాలాంధ్ర-దొరవారిసత్రం: సన్న, చిన్నకారు రైలకు వ్యవసాయం భారంగా మారింది. దీనికి తోడు ప్రైవేటు వ్యక్తులు నడిపే ట్రాక్టర్లతో వ్యవసాయ పనులు చేయుటకు ఖర్చులు అధికమవుతున్నాయి. దీనిని గమనించిన గత ప్రభుత్వం అన్నదాతలకు వ్యవసాయం చేయడానికి వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్, రోటవేటర్, ట్రైలర్, స్పేర్స్, టిల్లర్స్, నాగేలు తదితర 8 రకాల వ్యవసాయ యంత్ర పరికరాలను రైతు భరోసా కేంద్రాలకు అందించారు. అయితే ఈ రైతు భరోసా కేంద్రాలలో ఇద్దరు కన్వీనర్లను నియమించి వారి ద్వారా గ్రామంలోని రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన రోజు వారికి అద్దెకు ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లను అందజేయాలి. రైతులు ఇచ్చిన అద్దెను మినిట్ బుక్‌లో నమోదు చేసి వచ్చిన నగదును బ్యాంకులలో జమ చేయాలి. అనంతరం వ్యవసాయ పనులు పూర్తి అవగానే

2

కాలువ ఆక్రమణలు తొలగించాలి

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పుంగనూరు పట్టణంలో తరచుగా చెరువులు తెగి పట్టణంలోకి వరద నీరు ప్రవహించిన ఘటనలు అనేక ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో మార్చ్ నగర్ సైతం మునిగిపోయి వందలాది మంది నిరాశ్రయులయ్యారని గుర్తు చేశారు. వెంచర్ మధ్యన చెరువు మరవ లో ప్రత్యేకమైన కాలవను నిర్మించి కబ్జా నుండి విముక్తి చేయాలని కోరారు. కాలువ నిర్మాణానికి అయ్యే ఖర్చును సైతం బిల్డర్ నుండే వసూలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. లేనిచో భవిష్యత్తులో సిపిఐ ఆధ్వర్యంలో పుంగనూరు తో పాటు జిల్లా వ్యాప్తం గా ఆందోళన చేయవలసి వస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం సుబ్రహ్మణ్యం, విజయ్ గౌరి, రఘు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి భక్తులకు మరింత పారదర్శకంగా దర్శన, వసతి

పేజీ తరువాయి) వ్యక్తులు / మధ్యవర్తులు భక్తులను మోసం చేసి, భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారు.గత ఏడాది కాలంగా ఆన్‌లైన్ లో (రూ.300/- ప్రత్యేక ప్రవేశ దర్శనం, డిప్, వసతి, ఆర్జిత సేవలు, వర్చువల్ సేవలు మొదలైనవి) మరియు ఆఫ్‌లైన్ లో (ఎస్ ఎస్ డి టోకెన్లు, వసతి) తదితర ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ సేవల బుకింగ్‌లపై ఇటీవల టీటీడీ విచారణ జరిపింది. ఇందులో ఒకే మొబైల్ నంబర్, మెయిల్ ఐడీలు ఉపయోగించి మధ్యవర్తులు బల్క్ బుకింగ్ పొందినట్లు విచారణలో తెలిసింది.మోసపూరిత బుకింగ్ లపై విచారణ : ఈ ఏడాది తిరుమలలో కరెంట్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌తో 110 గదులు, గత ఏడాదిలో 12 మొబైల్ నంబర్లతో 124 గదులు పొందినట్లు అధికారుల విచారణలో నిర్ధారణ అయింది. అదేవిధంగా ఆన్‌లైన్ బుకింగ్‌లో ఒకే మొబైల్ నంబర్‌ను ఉపయోగించి 807 వసతి బుకింగ్‌లు, ఆన్‌లైన్ ఒకే ఇమెయిల్ ఐడిని ఉపయోగించి 926 వసతి బుకింగ్‌లు,ఒకే మొబైల్ నంబర్‌ని ఉపయోగించి ఒక సంవత్సరంలో 1,279 డిప్ రిజిస్ట్రేషన్‌లు,ఒకే మెయిల్ ఐడిని ఉపయోగించి ఒక సంవత్సరంలో 48 డిప్ రిజిస్ట్రేషన్‌లు,ఒకే ఐడి ప్రూఫ్‌ని ఉపయోగించి 14 ఎస్ఎస్‌డి సర్వ సర్వదర్శనం టోకెన్‌లు పొందినారు.భక్తులకు మధ్యవర్తుల ప్రమేయం లేకుండా, టీటీడీ అందిస్తున్న సేవలలో పారదర్శకతను మరింతగా పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ సేవలను మరింత మెరుగుపరిచి ఆఫ్‌లైన్‌లో మరియు ఆన్‌లైన్‌లో టికెట్లు పొందే దళారులు మరియు మధ్యవర్తులపై టీటీడీ చర్యలు చేపట్టింది. ఇందులో బల్క్ బుకింగ్‌లకు ఉపయోగించే మొబైల్ నంబర్‌లు, మెయిల్‌లు మరియు ఐడి ప్రూఫ్‌లు రద్దు చేశారు. ఫేక్ మొబైల్ నెంబర్లు, మెయిల్ ఐడిలు, ఐడి ప్రూఫ్ లు ఉపయోగించి ఇప్పటికే బుక్ చేసిన సేవలను ఉపయోగించడానికి అనుమతించబడవు. బుకింగ్ రద్దు అయినట్లు రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు తెలియజేయబడుతుంది. నిజమైన యాత్రికులు ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ఉపయోగించి మధ్యవర్తి లేకుండా సేవను నేరుగా పొందేలా టీటీడీ కార్యాచరణ రూపొందిస్తుంది. దళారులు ఫేక్ మొబైల్, మెయిల్ , ఐడి ప్రూఫ్‌లను ఉపయోగించి చేసిన బుకింగ్‌లపై కఠినమైన ఆంక్షలు విధించారు. సరైన ధృవీకరణ కోసం ఆధార్ సేవలను ఉపయోగించేలా టీటీడీ ప్రయత్నాలు చేపడుతోంది.

మానవ మృగాలను కఠినంగా శిక్షించండి

-అంబేద్కర్ స్టార్ కృష్ణ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: చిన్నారులపై అత్యాచారాలు పాల్పడుతున్న మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంబేద్కర్ స్టార్ కృష్ణ డిమాండు చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఆదివారం ఏర్పేడు మండలానికి చెందిన బలరామయ్య గౌడ్ (61) ఆరేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి నీచమైన చర్యలను మానవత్వం ఉన్న ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. నిందితులకు శిక్ష పడే వరకు పోరాడాలని స్టార్ కృష్ణ పిలుపునిచ్చారు. ఇలాంటి ఘోరమైన దురాగతాలు భవిష్యత్ లో జరగకుండా చూడాలన్నారు. ఏర్పేడు ఘటనపై రేణిగుంట డీఎస్పీతో మాట్లాడి గ్రామాల వారీగా కమిటీలు వేసే ప్రక్రియకు శ్రీకారం చుడతామని స్టార్ కృష్ణ తెలిపారు.

రాజనాల బండపై సత్య ప్రమాణాల జోరు

విశాలాంధ్ర - చిత్తూరు : చౌడేపల్లి మండలంలోని రాజనాలబండపై శనివారం సత్యప్రమాణాల జోరు కొనసాగింది ఈ ప్రాంతం నుంచి కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి విశేష సంఖ్యలో భక్తులు తరలివచ్చి రాజనాలపై వెలసిన ప్రసన్న ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు కొందరు సొమ్ము పోగొట్టుకున్న వారు ప్రమాణాలు చేయగా మరికొందరు వాయిదా వేసుకుని వెళ్లారు అనుమానితులు అధిక సంఖ్యలో తరలివచ్చి సత్య ప్రమాణానికి పూనుకున్నారు ఆలయ ప్రధాన అర్చకుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయాన్నే అభిషేకము అలంకరణ గావించారు సత్య ప్రమాణాలకు వచ్చిన భక్తులు స్వామి వారి మహిమలు తెలుసుకొని ప్రమాణాలు చేశారు ఈ కార్యక్రమంలో టిటిడి అధికారులు స్థానికులు భక్తులు పాల్గొన్నారు

భలే రా'బడి'

(మొదటి పేజీ తరువాయి) పేద, మధ్య తరగతి కుటుంబాల వారు రెక్కలు ముక్కలు చేసి కష్టపడి సంపాదించిన సొమ్మంతా పిల్లల చదువుకే చాలడం లేదు. చాలా మంది పిల్లల చదువు కోసం అప్పుల పాలై ఆస్తులు పోగొట్టుకుంటున్నారు. ఇదంతా కార్పోరేటు మాయ అని చెప్పవచ్చు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభించక పోవడం... ప్రైవేటు బడుల్లో ఫీజుల నియంత్రణపై విద్యాశాఖ అలసత్వం వహించ డంతోనే ఈ దుస్థితి ఏర్పడుతోంది. ఎల్ కేజీకే రూ.50వేలు..!తిరుపతి జిల్లా విద్యా సంస్థలకు పెట్టింది పేరు. తిరుపతి, శ్రీకాళహస్తి, వెంకటగిరి, గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, పుత్తూరు ప్రాంతాల్లో కార్పోరేటు విద్యా సంస్థల వారు తమ శాఖలను నిర్వహిస్తున్నారు. వీరి ప్రచార ఆర్భాటం చూసి ఇక్కడ నాణ్యమైన విద్య లభిస్తుందనే ఆశతో చాలా మంది ఈ బడుల్లో చేర్చుతున్నారు. ఈ బడుల్లో చేరాలంటే... పాఠశాల ఫీజుతో పాటు పుస్తకాలు, యూనిఫాం, టై, బెల్ట్, బ్యాడ్జి అలాగే బిల్డింగ్ ఫండ్, రిజిస్ట్రేషన్, అడ్మిషన్, రవాణా ఫీజు ఇలా ఎన్నో రకాల ఫీజులు చెల్లిం చాల్సి వస్తోంది. ఇవన్నీ లెక్కిస్తే ఎల్ కేజీకే రూ.50వేలు దాకా ఖర్చు అవుతోంది. పాఠశాల స్థాయిని బట్టి ఫీజులు ఉంటున్నాయి. కొన్ని కార్పోరేటు బడుల్లో పదవ తరగతికి ఫీజు, పుస్తకాలు, రవాణా, యూనిఫాం అన్నీ కలిపితేరూ.1.10లక్షలు దాటుతోంది. విచిత్రమేమి టంటే చాలా ప్రైవేటు, కార్పోరేటు బడులకు గుర్తింపు ఉండదు. అయినా దర్జాగా తరగతులు నిర్వహిస్తారు. ముక్కు పిండి ఫీజులు వసూలు చేస్తారు. రకరకాల పేర్లతో... ప్రైవేటు, కార్పోరే టు విద్యా సంస్థల నిర్వాహకులు ఫీజుల వసూళ్లకు రకరకాల పేర్లు వాడతారు. ఒలంపియాడ్, ఈ-టెక్నో, కాన్సెప్ట్, ఇంటర్నేషనల్, ఐఐటీ. ..ఇలా రకరకాల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను బురిడీ కొట్టిస్తు న్నారు. పెద్ద మొత్తంలో ఫీజులు గుంజుతున్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు సైతం తమ పాఠశాలలోనే కొనాలని ఆదేశిస్తు న్నారు. ఆ బడిలో చదవాలంటే వారు చెప్పినట్లు చేయాల్సిందే. గత విద్యా సంవత్సరంతో పోల్చితే ప్రస్తుతం సగటున 25శాతానికి ఫీజు పెంచేశారు. పుస్తకాలు, యూనిఫాం ఇతర సామాగ్రి ధర కూడా ఇలానే పెంచారు. పాఠశాలలో చేరిన రోజే సగం ఫీజు, రవాణా ఛార్జీ చెల్లించాలని నిబంధన విధిస్తున్నారు.ఒక్కో బడిలో ఒక్కో సిలబస్...విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలో ఒకేరకమైన పాఠ్యాంశాలు బోధించాలి. విద్యాహక్కు చట్టం కూడా ఇదే చెబుతోంది. అయితే ఈ కార్పోరేటు విద్యా సంస్థల వారు ఈ నిబంధన తుంగలో తొక్కు తున్నారు. వారు సపరేటు' సిలబస్ అమలు చేస్తున్నారు. ఈ సిలబస్ కు సంబంధించిన పుస్తకాలు ఎక్కడా దొరకవని. వీటితో పాటు నోటు పుస్తకాలు కూడా తమ వద్దే కొనే విధంగా హుకుం జారీచే స్తున్నారు. విధిలేని పరిస్థితిలో రూ.వేలకు వేలు వెచ్చించి పుస్తకాలు వారి బడిలోనే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఇవే పుస్తకాలు పూర్వ విద్యా ర్థుల నుంచి తీసుకుంటామని వేడుకున్నా అనుమతించడం లేదు. తప్పకుండా కొత్త పుస్తకాలు కొనుగోలు చేయిస్తున్నారు. నిబంధనలకు పాతర కార్పోరేటు, ప్రైవేటు విద్యా సంస్థలు నిబంధనలకు పాతర వేస్తున్నాయి. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు ప్రైవేటు, కార్పోరేటు పాఠశాల నిర్వహణ, ఫీజులకు సంబంధించి ప్రభుత్వం జీవోనంబరు:91 జారీ చేసింది. ఈ జీవో ప్రకారం ప్రతి ప్రైవేటు పాఠశాలలో గవర్నింగ్ బాడీ ఏర్పాటు చేయాలి. జిల్లా స్థాయిలో ఫీజుల నియంత్రణ కమిటీ (డీఎఫ్ ఆర్ సీ)లను నియమించాలి. పాఠశాల గవర్నింగ్ బాడీ ప్రతిపాది ంచిన ఫీజులను డీఎఫ్ఆర్ సీ పరిశీలించి తుది నిర్ణయం తీసుకోవాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో గరిష్టంగా రూ.24వేలు... ఉన్నత పాఠశాలల్లో రూ.30వేలకు మించి ఫీజులు వసూలు చేయకూడదు. విద్యా హక్కు చట్ట ప్రకారం కేపిటేషన్ ఫీజు, డొనేషన్లు వసూలు చేయడానికి వీలు లేదు. ఇలా వసూలు చేస్తే అంతకు పది రెట్లు పాఠశాల యాజమా న్యానికి జరిమానా విధించే అధికారం సంబంధిత అధికారులకు ఉంటుంది. పాఠశాల ప్రాంగణంలో పుస్తకాలు, ఇతరత్రా సామాగ్రి విక్రయించకూడదనే నిబంధన ఉంది. ఇక విద్యా హక్కు చట్ట ప్రకారం ప్రతి తరగతిలో 25శాతం మందికి ఉచితంగా ప్రవేశం కల్పించాలి. కానీ ఈ నిబంధనలు ఎక్కడా అమలు కావడం లేదు. వీటిని అమలు చేయాల్సిన అధికారులు ఫీజుల దందాను 'మామూలు'గా తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి విద్య పేరుతో దోపిడీ చేస్తున్న ప్రైవేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అద్దె ట్రాక్టర్లు ఎక్కడ?

(మొదట పేజీ తరువాయి) ఆ యంత్రాలను మరలా రైతు భరోసా కేంద్రాలలో భద్రపరచాలి. కాని ఎక్కడ కూడా రైతులకు రోజు వారి అద్దెకు యం త్రాలు అందించకుండా తూతూ మంత్రంగా రైతులకు అందిస్తున్నట్లు రికార్డులలో నమోదు చేశారు. ఆ యంత్ర పరికరాలను గ్రామంలో ఉన్న బడా నాయకులే భరోసా కేంద్రం అధికారులతో కుమ్మక్కై ఆ యంత్రా లను వారి ఇళ్లకు తీసుకొని వెళ్లినట్లు సమాచారం. అప్పటి నుంచి అసలైన పేదవాడికి వ్యవసాయ పనిముట్లు అందక నానా తిప్పలు పడుతూ ప్రైవేటు వ్యక్తులపైనే ఆధారపడి దుక్కిలు చేసుకుంటున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని 11 రైతు భరోసా కేంద్రాలలో 11 వైఎస్సార్ యంత్ర సేవా పథకాల ద్వారా ట్రాక్టర్స్, ట్రాలి, రోటవేటర్స్ తదితర వ్యవసాయ పనిముట్లను రాయితీలలో రైతు భరోసా కేంద్రాలకు అప్పగించారు. అసలు వైఎస్సార్ యంత్ర సేవా పథకం క్రింద గ్రూపులను ఏర్పాటు చేసి అందులో ఇద్దరిని కన్వీనర్లుగా ఎంచుకుని రైతు భరోసా కేంద్ర అధికారిచే ఈ యంత్రాలు అద్దెకు ఇవ్వాలి. కాని దొరవారిసత్రం మండలంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలలో అధికారుల నిర్లక్ష్యం వల్ల ఈ యంత్రాలు ఎక్కడ కూడా వినియోగించకుండానే బడా నాయకులు కనుసన్నల్లో ఈ పనిముట్లు ఉన్నాయి. ప్రభుత్వం సుమారు 15 నుండి 20 లక్షల రూపాయిల విలువగల వ్యవసాయ పనిముట్లను ఒక్కో రైతు భరోసా కేంద్రానికి అందజేసింది. అయితే ఈ పనిముట్లను గ్రామ స్థాయిలో ఉన్న నాయకులు తమ సొంత అవసరాలకు తప్ప మిగితా ఎవరికీ ఇవ్వడంలేదని పలువురు వాపోతున్నాయి. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ముఖ్య ఉద్దేశ్యం గాలికి వదిలేసి ఈ బడా నాయకులే ప్రభుత్వ వ్యవసాయ యంత్రాలను సొంత పనిముట్లుగా వాడుకుంటున్నా సంబంధిత అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం, తనయాలి, పూలతోట, వేణుంబాక, ఉచ్చూరు తదితర గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలల్లో ఎన్ని రకాలు వ్యవసాయ పనిముట్లు అందించారు? అసలు అద్దెకు ఈ వ్యవసాయ పనిముట్లు అందిస్తారని గ్రామాల్లో రైతులకు తెలియక పోవడం చాలా దారుణమని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ పనిముట్లను వాడుకుంటున్న ఆ నాయకులు నుండి సంబంధిత అధికారులు స్వాధీనం చేసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాలికల పూర్తి చదువు దేశానికి బలం: ప్రగతి డైరెక్టర్

గ్రామాలలో పది, ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిలకు సత్కారం

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : బాలికల విద్య వల్ల వ్యక్తులు, దేశాలు రెండూ ప్రయోజనం పొందుతాయని, ముఖ్యంగా ఆడపిల్లల విద్య దేశానికి మేలు చేస్తుందని అందుకే దేశానికి బలం బాలికల పూర్తి చదువు అని ప్రగతి డైరెక్టర్ కె వి రమణ అన్నారు. క్రై పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న పూరి పడాయి దేశ్ కి బాలాయి కార్యక్రమంలో భాగంగా ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం రేణిగుంట మండలంలోని మామండూరు, చైతన్యపురం, వెదల్ల చెరువు, ఏ.ఎన్. ఆర్ గ్రామాలలో పదవ తరగతి, ఇంటర్ పూర్తి చేసిన అమ్మాయిలను సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రగతి డైరెక్టర్ కె.వి రమణ మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుతోనే దేశ భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. ప్రతి అమ్మాయి కనీస విద్య అనగా ఇంటర్ పూర్తి చేస్తే, వారి జీవితం పట్ల అవగాహన కలిగి, ఉన్నత స్థాయికి వెళతారని తెలిపారు. పీసం నిరిష మన చుట్టుపక్కల ఉన్న విద్యాసంస్థలను వినియోగించుకొని, ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు మధుమతి, గంగమ్మ మాట్లాడుతూ తమ గ్రామాలలో ఆడపిల్లలు చదువుకునే బాధ్యతను తాము కూడా తీసుకుంటామని తెలిపారు. ఆడపిల్లలు ధైర్యంగా ముందుకు వెళ్లి తమ చదువు పూర్తి చేసుకున్నప్పుడే గ్రామాలలో అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రగతి సిబ్బంది జయలక్ష్మి, జయప్రకాష్, అంగన్వాడీ టీచర్లు మల్లీశ్వరి, గంగమ్మ, రాధమ్మ ఆశ వర్కర్ ఉమామహేశ్వరి, సిబిఓ, ఎస్.సి.వి మెంబర్స్ పాల్గొన్నారు.

చిన్నపాటి వర్షానికే బురదమయం

విశాలాంధ్ర - తడ: తడకండ్రిగ పంచాయతీ పరిధిలోని మదీనా కాలనీలో చిన్నపాటి వర్షానికి రోడ్లు బురద మయమై ఆ వీధుల్లో నడిచేందుకు కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. స్థానిక పంచాయతీ అధికారులు మదీనా కాలనీలోని రోడ్లకు గ్రావెల్ అయినా పరవాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు. వర్షాలు పడ్డప్పుడు రోడ్లు జలమయమై పిల్లలు మహిళలు ఆ వీధుల్లో నడిచేందుకు కూడా ఇబ్బందికరంగా ఉండటంటా స్థానికులు తెలిపారు. పంచాయతీ అధికారు లకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి రోడ్లు వసతి కల్పించి మదీనా కాలనీ వాసులు కోరుకుంటున్నారు.

ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి సన్మానం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డిని ఊరందూరులో శనివారం శ్రీకాళహస్తి డ్రైవింగ్ స్కూల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డ్రైవింగ్ స్కూల్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా శ్రీకాళహస్తికి చెందిన సోంపల్లి శేఖర్ నాయుడు ఎన్నుకున్నారు. శేఖర్ నాయుడు శ్రీకాళహస్తి పట్టణంలో శివసాయి మోటార్ డ్రైవింగ్ స్కూల్ నిర్వహిస్తున్నారు. శేఖర్ నాయుడుకు జిల్లా కార్యదర్శి పదవి రావడంతో శ్రీకాళహస్తి శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి సన్మానం చేశారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

విశాలాంధ్ర-తిరుపతి: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990-91లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం తలకోనలో అపూర్వ సమ్మేళనాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈసందర్భంగా వేర్వేరు వృత్తుల్లో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు తమకు పాఠాలు నేర్పిన గురువుల గొప్పతనాన్ని జ్ఞాపకం చేసుకున్నారు. ఈకార్యక్రమంలో జనార్ధన్, తిరుమల బాబు, మధు సూధన్, శేఖర్, నరేంద్ర, రాజేంద్ర, లక్ష్మీపతి, వాణి, యోగరంజని, లత, ఝాన్సీ, కుసుమ, రమాదేవి, శ్రీదేవి, కల్పన, శోభావాణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

తండ్రి,కొడుకుపై హత్యా యత్నం

విశాలాంధ్ర - చిత్తూరు : చౌడేపల్లి మండలం దిగుపల్లి పంచాయతీకి చేరిన కొలింపల్లి గ్రామంలో ఓ మహిళపై ట్రాక్టర్ ఢీకొనడంతో మహిళ ఆసుపత్రిపాలై ఇప్పటివరకు కోలు కోలేని సంఘటన ఆ విషయంపై కేసు కూడా నమోదు చేయడం జరిగింది. శనివారం సత్య ప్రమాణాలకు పేరుగాంచిన రాజనాల మండపై పంచాయతీ నిర్వహించి గ్రామ పెద్దలు ప్రమాణాలకు సిద్ధం కావాలని పంచాయతీ ఏర్పాటు చేశారు. అంతలోని గ్రామ పెద్దలపై దౌర్జన్యం రాజనాల బండలో తండ్రి,కొడుకుపై ప్రత్యర్థులు శనివారం హత్యాయత్నంకు పాల్పడ్డారు. పోలీసుల కథనం.. కొలింపల్లెకు చెందిన నాగరాజ ట్రాక్టర్తో అదే ఊరికి చెందిన ఓ మహిళను ఏడాది క్రితం తొక్కించాడు. ఆమె చావుబ్రతుకు లతో పోరాడుతోంది. గ్రామస్తులతో కలసి రాజనాల బండలో పంచాయతీ పెట్టి నాగరాజ సమస్య పరిష్కారం కోరారు. పెద్ద మనిషిగా వెళ్లిన ఆసాది ప్రభాకర్(45), ఆసాది నాగరాజుపై తీర్పు చెప్పి బాదితురాలికి పరిహారం ఇప్పించే ప్రత్నం చేశారు. తీర్పు సరి లేదని గణేష్, నాగరాజు బండరాళ్లతో తండ్రి కొడుకులను కొట్టి హత్యా యత్నంకు పాల్పడ్డారు.

ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే విడిచిపెట్టం: ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలను అతిక్రమిస్తే విచిపెట్టేది లేదని అఖిల భారత విద్యార్థి సమైక్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు హెచ్చరించారు. 2వ శనివారం కావడంతో శ్రీకాళహస్తిలో నడుస్తున్న టువంటి విద్యా సంస్థలకు వెళ్లి ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సెలవు ఇప్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కోగిలి, ముని చందు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధ నలను యదేచ్ఛగా అతిక్రమిస్తూ ప్రవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు సెలవు దినాలలో కూడా విద్యాసంస్థలను నడిపిస్తూ విద్యా ర్థులను ఒత్తిడికి గురిచేస్తూ వారి ప్రాణాలు తీసే వరకు తీసుకెళ్తున్నారని అన్నారు. ప్రతి ఒక్క ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో చదువుతున్న టువంటి విద్యార్థికి ఫీజు ఒకే విధంగా కట్టించుకుని ఒకే టీచర్ పాఠం చెబుతూ ఎందుకు పరీక్షల్లో ఫెయిల్ అవుతున్నారో సమాధానం చెప్పి తీరాలన్నారు. అందరి తల్లిదండ్రుల దగ్గర ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థి యొక్క ప్రతిభని బట్టి పాస్ అవడం ఫెయిల్ అవడం జరుగుతుంది అంటున్నారు. మరి ఆ ప్రతిభ ఆధారం గానే ఫీజులు ఒక్కొక్కరు దగ్గర ఒక్కొక్క లాగా కట్టిం చుకునే దమ్ము మీకుందా? మరి ఎందుకు మీ పాఠశా లలో చేరాలి? ప్రభుత్వం ఎందుకు చేరకూడదు? సమాధానం ఇచ్చి తీరాలి ప్రతి ఒక్కరిని ఉత్తీర్ణులను చేసే ప్రతి ఒక తల్లిదండ్రులకు న్యాయం చేయా లని కోరా రు. అదేవిధంగా సెలవు దినాలలో విద్యార్థు లకు మానసిక స్వేచ్ఛని లేకుండా చేస్తున్నటువంటి విద్యా సంస్థల పైన విద్యాశాఖ అధికారులు వెంటనే చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు. స్వతంత్రం వచ్చి ఎన్ని సంవత్సరాలు అయినప్పటికీ విద్యార్థికి మాత్రం ఎటువంటి స్వేచ్ఛ లేకుండా చేస్తున్నటువంటి విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ శ్రీకాళహస్తి పట్టణ అధ్యక్షులు అభి, శివ, సతీష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పం ఇంజనీరింగ్ కాలేజీకి అటానమస్ హెూదా

విశాలాంధ్ర - కుప్పం : కుప్పం ఇంజనీరింగ్ కాలేజీకి యూజీసీ , న్యూ ఢిల్లీ వారిచే 10 సంవత్సరములకు, 2024-25 నుండి 2033 -34 వరకు , అటానమస్ హెూదా లభించిందని కళాశాల చైర్మన్ బి.సి. నాగ రాజ్ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడు తూ దేశానికీ అత్యుత్తమ నాణ్యత ప్రమాణాలతో కూడిన ప్రతిభావం తులయిన విద్యార్థులను తీర్చిది ద్దుతూ కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ బోధన మరియు పరిశోధనలలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సంతరించుకొందని, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల కూడలిలోని కుప్పం మారుమూల ప్రాంతం లో 2001 ప్రారంభిం చబడిన కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ ఎన్. బి. ఏ మరియు న్యాక్ ఏ గ్రేడ్ హెూదాను సాధించి ఉన్నత విద్యారంగ ములో జాతీయ స్థాయిలో ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపును పొందిందని, యూజీసీ అటానమస్ గుర్తిపు నేపథ్యంలో కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ నేడు సాంకేతిక రంగములో ఉన్నత లక్ష్యాలను విద్యార్థులు అందుకునేలా తన పాఠ్యాంశాలను రూపకల్పన చేయడానికి ప్రణాళికను సిద్ధం చేసిందని, విద్యారంగములో ఆధునిక సాంకేతికను గరిష్టంగా వినియోగిస్తూ చక్కటి మౌలిక సదుపాయా లతో అపారమయిన అనుభవం కలిగిన అధ్యాపక బృందంతో పరిశ్రమల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ తదనుగుణంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ ముందడుగు వేస్తున్నదిని ప్లేసెమెంట్ ల విషయములోను ప్రపంచములోని అతిపెద్ద బహుళార్ధ సాధక కంపెనీ లలో ఆకర్షణీయమయిన ప్యాకేజీలను విద్యార్థులు అందుకునేలా తీర్చిదిద్దుతుందని, కుప్పం ఇంజనీరింగ్ కాలేజీ టాప్ రిక్రూటర్స్ లను ఆకర్షిస్తూ విద్యారంగానికి పరిపూర్ణతను అందిస్తూ బోధనలో మైలురాయిని సాధించిందని తెలిపారు.కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ వివిధ విభాగాలలో విద్యార్థులు చక్కటి అనుభూతి పొంది ప్రపంచ సాంకేతికను అందిపుచ్చుకొనేలా కోర్స్ ల రూపకల్పన కి ప్రణాళికను సిద్ధంచేస్తున్నదని, సివిల్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఆర్టిఫిషల్ ఇంటిలిజన్సీ మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్ విభాగాలలో లలో గ్రాడ్యుయేట్,పోస్ట్ గ్రాడ్యు యేట్ స్థాయిలో కోర్సులను అందిస్తుందని, వీటితోపాటు డిప్లొమా కోర్సులు కూడా అందుబాటులో ఉన్నాయని ఇంజినీరింగ్ విభాగంలో పరిశోధనలకు పెద్దపీట వేస్తూ పిహెచ్ డి కోర్స్ లను కూడా నిర్వహిస్తున్నది తెలిపారు.ఈ సందర్భంగా కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ కు అటానమస్ హెూదా రావడానికి కృషి చేసిన కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్.సుధాకరబాబు ని ,వైస్ ప్రిన్సిపాల్ డా .ఎస్ . బాస్కరన్, అధ్యాపకులను, విద్యార్థులను మరియు బోధనేతర సిబ్బందిని కళాశాల వైస్ చైర్మన్ డా .ఎన్ .సునీల్ రాజ్ మరియు సీఈఓ సాగర్ రాజ్ అభినందించారు.

అన్న క్యాంటీన్‌కు 200 స్టీల్ ప్లేట్ల వితరణ

విశాలాంధ్ర -చిత్తూరు: నగరంలోని అన్న క్యాంటీన్‌కు 200 స్టీల్ ప్లేట్లను యాదమరి మండలానికి చెందిన జీవరత్నం నాయుడు ఉచితంగా అందజేసి తన ఉదారతను చాటుకు న్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోనే మొదటిగా చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో పునః ప్రారంభమైన అన్న క్యాంటీన్‌కు 200 వందల స్టీల్ ప్లేట్లను వితరణ చేసిన యాదమర్రి మండలం, బండివాండ్ల పూరుకు చెందిన బండి జీవరత్నం నాయుడు కుటుంబ సభ్యులు స్టీల్ ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరులో...

భారీ అగ్ని ప్రమాదం

- దుకాణదారుడుకి కోటి రూపాయలు నష్టం

- ఇంఛార్జి గూడూరు అగ్నిమాపక అధికారి విజయ్ కుమార్ వెల్లడి

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలోని కుమ్మరవీధిలో ఎన్నో ఏళ్ళుగా ఉన్న సూర్య ఫ్యాన్సీ దుకాణంలో శనివారం వేకువ జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగిసి పడడంతో పరిసర ప్రాంతాల వారు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. సంఘటనా స్థలికి సకాలంలో చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ఎంతగానో ప్రయత్నించారు. మంటలను అదుపులోకి రాలేదు. అగ్ని మాపక యంత్రంలో నీరు అయిపోయింది. దీంతో మంటలు మరింత వ్యాపించి మూడు అంతస్థుల్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. దట్టమైన పొగ చుట్టుముట్టింది. దుకాణంలో ఉన్న విలువైన వస్తువులు అన్నీ కాలిపోయాయి. ఈ సందర్భంగా ఇంఛార్జి అగ్ని మాపక అధికారి విజయకుమార్ మాట్లాడుతూ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన జరిగిందన్నారు.దుకాణం పూర్తిగా దెబ్బతిందని , ఒక కోటి రూపాయలు వరకు ఆస్తి నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ విషయం తెలుసున్న గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని షాప్ యజమాని తో అగ్ని ప్రమాదం పై చర్చించారు.అనంతరం ప్రభుత్వ పరంగా సాయం అందేలా చేస్తామని పేర్కొన్నారు. ఈ ఘటన జరగడం బాధాకరం అన్నారు. ఈయన వెంట టీడీపీ నాయకులు , తదితరులు పాల్గొన్నారు.

విశ్వతమాలను మోడల్ గ్రామంగా తయారు చేయాలి

జెడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: విశ్వతమాల గ్రామాన్ని మోడల్ గ్రామంగా తయారు చేసి మండలములో ముందునిలబెట్టాలని జెడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య పిలుపునిచ్చారు. శనివారం విశ్వతమాల గ్రామ సభ సర్పంచ్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంకు ఏర్పేడు జెడ్పీటీసీ డాక్టర్ కావేరి తిరుమలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని మోడల్ గ్రామంగా తయారు చేసి మండలములో ముందు నిలబెటాలని కోరారు. అలాగే మన గ్రామాన్ని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆలోచన మేరకు శానిటేషన్, త్రాగు నీరు, వీధి దీపాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రజల్లో మనపట్ల మంచి అభిప్రాయం కలిగేలా పాలన వుండాలని, దానికి గ్రామ ప్రజలు వార్డు సభ్యులు పూర్తి సహకారం అందిస్తూ ముందుకు వచ్చి ప్రతి సమస్య పట్ల స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి టి.రుక్మిణి, ఉప సర్పంచి శివయ్య, మాజీ ఎంపీటీసీ టీడీపీ సీనియర్ నాయకులు వి.బాలాజీ నాయుడు, మాజీ సర్పంచి పూల హేమాక్షి, కె.మునిరత్నం యాదవ్, కావాలి రామచంద్రయ్య, కె.మునికృష్ణయ్య, కె.యుగంధర్, ఎం.చలపతి, బి.మణి, కాకి.రాధ, కాకి.ఢిల్లీ బాబు, ఎం.గిరి బాబు, గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లినేని జగన్నాథంనాయుడు దాతృత్వం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రముఖ సంఘ సేవకులు, రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథంనాయుడు మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. శ్రీకాళహస్తి మండలం రాచగున్నేరి పంచాయతీ పరిధిలోని చటర్జీ నగర్ కోళ్ల ఫారం వద్ద చిందేపల్లె, చటర్జీనగర్ కు వెళ్లే మార్గంలో దారికి ఇరువైపులా విపరీతంగా ముళ్ల చెట్లు పెరిగి పోవడం... రోడ్డు గుంతలు పడటంతో బాటసారులు అనేక ఇబ్బందులు పడేవారు. ఇది గమనించిన బొల్లినేని జగన్నాథంనాయుడు శనివారం ఎక్కువేటరు సాయంతో ముళ్ల చెట్లు తొలగించారు. అదేవిధంగా రోడ్డుపై ఏర్పడిన గుంతలకు మట్టి వేయించి పూడ్చేయించారు. జగన్నాథంనాయుడు తన సొంత నిధులతో ఈ పనులు చేయించారు. ఇందుకు స్థానికులు ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు. బొల్లినేని సేవా దృక్పథాన్ని కొనియాడారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

విశాలాంధ్ర- మదనపల్లి: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె రామిరెడ్డి లే అవుట్ నందు ఉన్న వివేకానంద మున్సిపల్ హై స్కూల్ నుండి 11 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వీరందరూ ఇడుపులపాయ, శ్రీకాకుళం, నూజివీడు ట్రిపుల్ ఐటీ కాలేజిల్లో చేరనున్నారు. ఎంపికైన వారిలో దీక్షిత, హేమమాలిని, ఖ్యాతి శ్రీ, లక్ష్మి, మహర్షిక, హరిత, తేజవర్ధన్, గణేశ్వరి, రాకేష్, రాగిణి, ధనలక్ష్మి లు ఉన్నారు. ఎంపికయిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర బాబు, వార్డు కౌన్సిలర్ శివయ్య, ఉపాధ్యాయులు శుభాభినందనలు తెలిపారు.

రాజకీయ దాడులు చేయొద్దు

- తిరుపతి ఎంపీ గురుమూర్తి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాజకీయాలు ఎన్నికల వరకే చూడాలని... అధికారం ఉందని ప్రతిపక్ష కార్యకర్తలపై కక్షపూరిత దాడులు చేయడం సమం జసం కాదని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి అన్నారు. శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామంలో శుక్రవారం రాత్రి ఇరు పార్టీల ఘర్షణలో గాయపడి స్థానిక ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న వైసీపీ కార్యకర్త రమేష్ ను శనివారం ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరామర్శించారు. బాధితుడు రమేష్ ను ఘర్షణకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు కక్ష కట్టి దాడులకు పాల్పడుతు న్నారని... తనను తన కుటుంబాన్ని వేధిస్తున్నారని బాధితుడు రమేష్ ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. పరామర్శ అనంతరం ఎంపీ గురుమూర్తి, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్ష సాధింపులు తగమన్నారు. గ్రామాలు ప్రశాం తంగా ఉంచాలని... కక్ష సాధింపులతో దాడులు చేసుకుంటూ పోతే గ్రామాలు అశాంతికి నిలయంగా మారుతాయని ఇది మంచి పద్ధతి కాదన్నారు. పోలీ సులు తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

విశాలాంధ్ర - తడ : మండల పరిధిలోని కొండూరు గ్రామంలోని మహిళా హాస్టల్లో ఉంటూ సమీపంలోని పరిశ్రమలో పనిచేసుకుంటున్న యువతీ అదృశ్యమైంది అంటూ తడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందింది. తడ ఎస్సై పి నరసింహారావు సమాచారం మేరకు అనంతపురం జిల్లా గుంతకల్ మండలం గుంతకల్ గ్రామం సంజీవ్ నగర్ కు చెందిన చాకలి యశోదమ్మ 27 సంవత్సరాలు అనే యువతి కియో కంపెనీలో పనిచేస్తూ ఆపై తిరుపతిలోని సీసీఎల్ పరిశ్రమలో పనిస్తుండేదని గత మూడు నెలల క్రితం కొండూరు సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తూ బీహార్ కు చెందిన సింకూ మారండి అనే యువకుడితో పరిచయమైనట్లు తెలుస్తోంది ఈనెల మూడవ తేదీ నుండి యువతి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడక పోవడం ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో యువతి కోసం వచ్చిన వారి తల్లిదండ్రు లు వారి కుమార్తె ఆచూకీ తెలియకపోవడంతో శనివారం తడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారనీ ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు

దళిత మహిళ మృతికి కారకులను శిక్షించాలి

విశాలాంధ్ర - పలమనేరు : దళిత మహిళ మృతికి కారకులైన అగ్రకుల దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ బృందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అందులో భాగంగా శనివారం వినోద్ కుమార్ అధ్యక్షతన పలమనేరు పట్టణంలో మానవ హక్కుల కార్యాలయం నందు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు డివి మునిరత్నం, వేలాయుధం, రవికుమార్ మాట్లాడుతూ దళిత మహిళ గుండమ్మ తన రెక్కల కష్టముతో సంపాదించిన భూమిలో వాటా ఉండటంతో కర్నూలు జిల్లా ఆదోని మండలం నాగనాతనహళ్లి గ్రామానికి చెందిన రాఘవేందర్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి వీళ్ల అనుచరులు దౌర్జన్యంగా పొలంలోకి అక్రమముగా ప్రవేశించి ట్రాక్టర్ తో దున్నడానికి ప్రయత్నిస్తే అడ్డుకున్న దళిత మహిళ గుండమ్మను ట్రాక్టర్ తో తొక్కించి హత్య చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. న్యాయస్థానాలను గౌరవించలేని దుర్మార్గులకు అదే న్యాయస్థానాలు శిక్ష పడే విధంగా చూడాలని కోరారు. ఈ విషయంలో పోలీసులు ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిపి హత్యకు పాల్పడిన దుర్మార్గులను వెంటనే న్యాయస్థానంలో ప్రవేశ పెట్టాలన్నారు. ప్రభుత్వం అటువంటి హంతకులకు వత్తాసు పలకకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంబశివ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై గ్రామ సభలు

విశాలాంధ్ర-రామసముద్రం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేసిన పనులకు శనివారం నుండి రామసముద్రం మండలంలో గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. 2023 ఏప్రిల్ ఒకటి నుండి 2024 మార్చి 31 వరకు చేసిన పనులకు సామాజిక తనిఖీలు జరిగాయి. దీంతో గ్రామసభలు ప్రారంభమయ్యాయి. మండలంలో మొత్తం ఐదు కోట్ల 90 లక్షల రూపాయలకు పనులు జరిగినట్లు ఏపీవో గౌరీ శంకర్ తెలిపారు. శనివారం మండలంలోని పెద్దకురపల్లి పంచాయతీలోని తిరుమలరెడ్డి పల్లి సచివాలయంలో గ్రామ సభ జరిగింది కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప నాయుడు ఎంపీటీసీ రెడ్డప్ప పంచాయతీ సెక్రెటరీ సాంబమూర్తి ఫీల్డ్ అసిస్టెంట్ గణేష్ పాల్గొన్నారు.

జిపిఎస్ అమలు జివో విడుదలను విరమించుకోవాలి

విశాలాంధ్ర-మదనపల్లి: సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ఆకాంక్షగా ఉంటే, దానికి విరుద్ధంగా గత ప్రభుత్వం జిపిఎస్ అమలు చేస్తానని చెప్పిన పోరాటాలు ఫలితంగా తాత్కాలికంగా జీవోను విడుదల చేయలేదని, ఇప్పుడు బ్యాక్ డేట్ తో జిపిఎస్ అమలు చేస్తూ రాజపత్రాన్ని విడుదల చేయటం దుర్మార్గమని ఆర్వి రమణ ఎస్ టి యు రాష్ట్ర నాయకులు ఒక ప్రకటనలో ఖండించారు. 2023 అక్టోబర్ నుంచి సిపిఎస్ ఉద్యోగులందరినీ జిపిఎస్ లోకి తెస్తూ రాజపత్రాన్ని ఇప్పుడు విడుదల చేయటం. అధికారులు ఉద్యోగ ఉపాధ్యాయులను మోసపుచ్చటమేనని తెలిపారు. 2017లో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మెమో 57ని తక్షణం అమలు చేసి 2003 డిఎస్సీ ద్వారా అపాయింట్ అయిన ఉపాధ్యాయులందరినీ పాత పెన్షన్ లోకి పునరుద్ధరించాలని కోరారు.

117 జిఒ రద్దు చేస్తేనే

పాఠశాలల మనుగడ: ఎస్టియు

విశాలాంధ్ర -చిత్తూరు : అసంబద్ధమైన 117 జి.ఓను రద్దు చేసి, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ పట్ల చిత్తశుద్ధిని చాటాలని, రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం చిత్తూరు ఎస్టీయూ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు మదన్ మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం జారీ చేసిన 117 జీవో కారణంగా ప్రభుత్వ పాఠశాలలు చాలా వరకు మూతపడ్డాయని, టీచర్ పోస్టులు భారీ సంఖ్యలో కుదించబడ్డాయని, దీనివల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల నమోదు తగ్గిపోయిందని విమర్శించారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈ జీవోను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని తప్పనిసరిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలు, జీవన ప్రమాణాలకు అనుగుణంగా మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరారు. ఉమ్మడి సర్వీసు నిబంధనలకు అనుగుణంగా పదోన్నతుల ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.ఏకోపాధ్యాయ పాఠశాలల సమస్య నివారించేలా, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్, ఎయిడెడ్, గురుకుల, ఆదర్శ పాఠశాలల సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పిఎఫ్ స్లిప్పులు ఆన్లైన్లో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.టి.యు రాష్ట్ర నాయకులు సుబ్రమణ్యం రాజు, గంటా మోహన్, హేమచంద్ర రెడ్డి, శ్రీదేవి, జగన్మోహన్ రెడ్డి, లోకనాథ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు బోడే మోహన్, యువరాజు, పవన్ కుమార్ రెడ్డి, రమణా రెడ్డి, రమేష్ రెడ్డి, పల్గుణ మునిరాజు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మహేందర్ రెడ్డి

విశాలాంధ్ర-గూడూరు: ఏపీ మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని గూడూరు మండలం నెల్లటూరు గ్రామానికి చెందిన జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, వైసీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ పూటుకూరు మహేందర్రెడ్డి శనివారం తాడేపల్లి జగన్ మోహన్ రెడ్డి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని వైసిపి నాయకులు అంతా వైసిపి గెలుపు కోసం ఎంతో కష్టపడ్డారని ఒక్కసారిగా వైసిపి ఓటమి పాలు అవ్వడంతో వారందరూ ఎంతో నిరాశతో ఉన్నారని ఆయన జగన్ తెలిపారని దానికి జగన్మోహన్ రెడ్డి స్పందించి ఎవరు నిరాశ చెందవద్దు అని నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని, సమయం ఉన్నప్పుడు వారిని నేరుగా తన వద్దకు తీసుకొ రావచ్చని ఆయనకు తెలిపారని ఆయన పేర్కొన్నారు. ఈయన వెంట గూడూరు వైస్ ఎంపీపీ శ్రీనివాసులు రెడ్డి ఉన్నారు.

16న శ్రీసిటీలో మెగా ఉద్యోగ మేళా

విశాలాంధ్ర-సత్యవేడు: శ్రీసిటీ,ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఈ నెల 16న శ్రీసిటీలో 'ఫ్లాగ్' పేరిట మెగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నారు.స్థానిక సెంట్రల్ ఎక్స్‌ప్రెస్ రహదారిలోని శ్రీసిటీ ట్రేడ్ సెంటర్‌లో ఉదయం 8:30 గంటలకు ఉద్యోగ మేళా కార్యక్రమం ప్రారంభమవుతుంది.ఉద్యోగాల వేటలో వున్న అర్హత కలిగిన అభ్యర్థులను శ్రీసిటీ పరిశ్రమలతో అనుసంధానించడం ఈ ఫ్లాగ్ ఉద్యోగ మేళా ప్రధాన ఉద్దేశ్యం.ఇందులో అధునాతన సాంకేతికతను ఉపయోగించి నియామక ప్రక్రియ చేపట్టనున్నారు. 2022, 2023, 2024లో ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, ఇంజినీరింగ్లో ఉత్తీర్ణత సాధించిన వారు ఈ మేళాలో పాల్గొనేందుకు అర్హులు. ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ వారి స్మార్ట్ సాంకేతికత సాయంతో ఒకే రోజులో వివిధ కళాశాలల నుండి పెద్ద సంఖ్యలో విభిన్న ప్రతిభావంతులను కంపెనీలు ఎంపిక చేసుకునే అవకాశం కలుగుతుంది.ఈ విధానం నియామక ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు కంపెనీల అంచనాలపై విద్యార్థులకు విలువైన సమాచారాన్ని, అవగాహనను కలుగచేస్తుంది.ఆసక్తిగల అభ్యర్థులు ఈ కార్యక్రమం గురించి మరిన్ని వివరాల కోసం ఎంప్లాయబిలిటీ బ్రిడ్జ్ సోర్సింగ్ హెడ్ శ్రీమతి ప్రియా కవిచెల్వన్‌కు 73052 54222 నెంబర్ కు ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

వైద్యాధికారులతో కురుగొండ్ల సమావేశం

విశాలాంధ్ర-వెంకటగిరి: వెంకటగిరి పట్టణ మరియు బాలాయపల్లి మండల వైద్య శాఖకు సంబంధించిన అధికారులతో శనివారం వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వైద్యశాలలో డయాలసిస్ కేంద్రం గురించి వైద్యులతో చర్చించారు. ఆసుపత్రిలో మౌలికవ వసతులు, నూతన పరికరాలు, వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆసుపత్రి భవనముల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కాంక్రీట్ పనికి వచ్చి మహిళ మృత్యువాత

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరు పేటలో శనివారం విషాధ ఘటన చోటుచేసుకుంది. బ్రతుకుదెరువు కోసం చుట్టుపక్కల గ్రామాల నుంచి సూళ్లూరుపేట బజారులో పని నిమిత్తం కుమ్మరిపాలెం గ్రామస్తురాలు ఎర్రబోతు ఇందిరమ్మ (45) భర్త చెంచురామయ్య సూళ్లూరుపేట రైల్వే స్టేషన్ వీధిలో ఒక ఇంటికి స్లాబ్ పోయాల్సిన పని నిమిత్తం వచ్చారు. అక్కడే ఉన్న మిల్లర్‌కు ఇందిరమ్మ చీర, వెంట్రుకలు చుట్టుకోవడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. తల తెగి పక్కన పడిపోవడంతో సంఘటన స్థలంలో ఉన్న అతని భర్త, కుమారులు, బంధువులు ఆ సంఘటన చూసి కన్నీరు మున్నీరు అయ్యారు. విషయం తెలుసుకున్న ఎస్సై రహీం రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విద్యుత్ నగర్‌లో... మహిళ అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విద్యుత్ నగర్‌లో దారుణం జరిగింది. శుక్రవారం రాత్రి వాచ్ మెన్ భార్య రెడ్డమ్మ అలియాస్ ప్రసన్న (59) దారుణ హత్యకు గురయ్యారు. గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి ఆమె గొంతు కోసి పరాయ్యారు. ఆ సమయంలో ఆమె భర్త రామిరెడ్డి వ్యక్తిగత పనుల నిమిత్తం కడపకు వెళ్ళడంతో పలు అనుమానాలకు తావిస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. స్థానిక సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. హత్యకు గల కారణాలను అన్వేషిస్తున్నారు. దొంగలే హత్య చేసి ఉంటారా, లేదా మరేదైనా కారణం ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద భరితంగా ప్రధాన రోడ్డు

ప్రేక్షక పాత్ర వహిస్తున్న ఆర్అండ్‌బి అధికారులు

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు టు ఊతుకోట ప్రధాన రోడ్డు మార్గం దుస్థితికి చేరుకుంది. రోడ్డుకు వేసిన కంకర లేచిపోవడంతో పలుచోట్ల గుంతల మయంగా మారింది. దీంతోపాటు ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో కోతలకు గురై రోడ్డు ధ్వంసమైంది. ప్రధానంగా సత్యవేడు నుంచి ఊతుకోటకు వెళ్లే మార్గం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సమీపంలో ఏర్పడ్డ గుంతలు ప్రమాద భరితంగా మారాయి. దీంతోపాటు పడుతున్న వర్షాలకు గుంతల్లో నీళ్ళు నిలిచిపోవడంతో మడుగును తలపిస్తున్నాయి. పైగా సత్యవేడు వారపుసంత, వెంకటరాజులకండ్రిగ ఆదిఆరుంధతివాడ తదితర ప్రాంతాల్లో కూడా ప్రధాన రోడ్డు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో ఈ మార్గంలో వాహన రాకపోకలు ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు ఈ మార్గంలో వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిందే. దీంతోపాటు వర్షాలకు గుంతల్లో నీళ్లు నిలిచిపోవడంతో ఇప్పటికే ద్విచక్ర వాహనదారులు పలువురు గుంతల్లో పడి ప్రమాదానికి గురైన సంఘటనలు ఉన్నాయి. గత ఏడాదిగా సత్యవేడు టు ఊతుకోట ప్రధాన రోడ్డు మార్గం దెబ్బతింటున్న సంబంధిత రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. కనీసం రోడ్డకు ఏర్పడ్డ గుంతలను పూడ్చడానికి చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం పట్ల సర్వత్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మార్గంలో పలుచోట్ల ఏర్పడ్డ గుంతలకు ఒక తట్ట మట్టి పోసి పూడ్చాలన్న ధ్యాస సంబంధిత ఆర్అండ్‌బి అధికారులలో లోపించడం విమర్శలకు దారితీస్తోంది. ఈ నేపథ్యంలో సత్యవేడులో ఆర్అండ్‌బి శాఖ ఉన్నట్టా? లేనట్టా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు దీనిపై స్పందించి సత్యవేడు టు ఊతుకోట మార్గంలో ఏర్పడ్డ గుంతలను పూడ్చడానికి తగు చర్యలు తీసుకొని వాహనదారుల ప్రాణాలను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

నిధులు విడుదలపట్ల ఆర్థిక మంత్రికి ధన్యవాదాలు

విశాలాంధ్ర-పెళ్లకూరు: మండలం లోని బంగారంపేట పంచాయతీ సర్పంచ్ నాగేంద్ర ప్రసాద్ రెడ్డి పయ్యాల కేశవ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్ర ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ జులై 11న రాష్ట్ర సచివాలయం నందు ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే గ్రామపంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు 250 కోట్ల రూపాయల నిధులు విడుదల చేస్తూ తొలి సంతకం చేసినందుకు రాష్ట్రంలోని 12918 గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, మరియు మూడున్నర కోట్ల గ్రామీణ ప్రజల అందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. గత ఐదు సంవత్సరాలుగా వివిధ పద్దుల కింద గత ప్రభుత్వం బకాయి పడిన మిగతా నిధులు కూడా త్వరితగతిన విడుదల చేయవలసినదిగా కోరినట్లు తెలిపారు. పయ్యాల కేశవుకు మండలం తరపున అభినందనలు తెలియజేశారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

క్రిక్కిరిసిన పట్టణ పుర వీధులు

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలో శ్రీ జగన్నాథ రథయాత్రను భక్తులు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. నెల్లూరు ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో ప్రతి ఏటా గూడూరు పట్టణంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. గూడూరు పట్టణంలోని సొసైటీ ప్రాంతం నుండి నారాయణమ్మ గుడి వద్ద నుండి రథ యాత్ర ప్రారంభం అయింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో జగన్నాథుడి విగ్రహాన్ని ఆశీనులను చేసి శా స్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం ఊరేగింపు నిర్వహించా రు. అక్కడి నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర పట్టణ పురవీధుల గుండా శోభాయమానంగా సాగింది. భక్తులు అధిక సంఖ్య లో పాల్గొని హరే రామ హరే కృష్ణ అంటూ భక్తి పారవశంగా పారాయణం చేశారు. స్వామివారిని భక్తులు దర్శించుకుని తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. చిన్నారుల కోలాటం, చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణతో ప్రత్యేకంగా నిలిచారు.

డిసిసిబి బ్యాంక్ అక్రమాలపై విచారణ జరిపించాలి

టిడిపి నేతలు డిమాండ్

విశాలాంధ్ర-చిత్తూరు: చిత్తూరు జిల్లాలోని డిసిసిబి బ్యాంకులో జరిగిన అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని టిడిపి నేతలు సప్తగిరి ప్రసాద్ మోహన్ రాజ్ యుగంధర్ డిమాండ్ చేశారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఉద్యోగ నియామకాల్లో గాడిదప్పిన పాలన సింగల్ విండోల్లో జరిగిన దోపిడీ పైన విచారణ జరిపించి ప్రజాదానాన్ని కాపాడాలి గూర్చి చిత్తూరు జిల్లాలో డిసిసి బ్యాంకులో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగినట్లు పత్రికల్లో ప శీర్షికన వార్తలు వచ్చాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రుణాలు మం జూరులో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగా యని, అనర్హులకు వైసీపీ కార్యకర్తలకు రుణాలు మంజూరు చేసి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసినట్లు వార్తలు వచ్చి ఉన్నాయిని తెలిపారు. జె. ఎల్. జి రుణాలు కూడా పక్కదారి పట్టించి పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగినట్టు ఆరోపణ ఉన్నట్టు తెలిపారు. అంతే కాకుండా ఉద్యోగ నియామకాలలో కూడా పెద్ద ఎత్తున తిరిగి డబ్బులు చేతులు మారాయని, కోట్ల రూపాయల రుణాలు రైతులకు మంజూరు చేయవలసి ఉండగా కోట్ల రూపాయల రుణాల్ని వైసిపి నాయకులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి యొక్క ప్రోత్సాహంతో పంచుకుని తిన్నారని, ఇందులో బ్యాంకు ఉద్యోగస్తులు కూడా పాత్రధారులై ఉన్నారు కావున నిజా నిజాలు అన్ని బయటకు రావాలంటే జిఎం స్థాయి అధికారి చేత విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించి బ్యాంకు నిధులను రికవరీ చేయాలని తెలుగుదేశం పార్టీగా డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.

చికిత్స పోందుతూ గురుకుల పాఠశాల విద్యార్థి మృతి

గురుకుల పాఠశాల ఎదుట ఎఆర్‌పిఎస్ ఆందోళన

విశాలాంధ్ర-రాపూరు : డక్కిలిలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్న రాపూరు చెందిన అడసన పల్లి రవి మాధవి కుమార్తె షరీనా జ్వరంతో వారం రోజుల నుండి బాధ పడుతుండడంతో జ్వరం మాత్రలు ఇస్తువచ్చారు. జ్వరం తగ్గగక పోవడంతో తల్లిదండ్రు లకు తెలియజేయడంతో రాపూరులో ఆసుపత్రికి తీసుకెళ్లగా డెంగ్యూ జ్వరమని పాప పరిస్థితి విషమంగా వుందని తెలియజేయడంతో చెన్నైకు తీసికెళ్ళడం జరిగింది. చెన్నైలో చికిత్స పోందుతు పాప మృతి చెందింది. గురుకుల పాఠశాల అధికారి సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పాప మృతి చెందిందని గురుకుల పాఠశాల ఎదుట ఎంఆర్ పిఎస్ నాయకులు, బంధువులు ఆందోళన చేపట్టి డక్కిలి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వెంకయ్య స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర- మనుబోలు: మనుబోలు చెర్లోపల్లి రైల్వే గేట్ సమీపాన ఉన్న శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి వారికి శనివారం సంద ర్భంగా క్షీరభిషేకం మధ్యా హ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించి అన్న ప్రసాదాన్ని స్వీకరించడం జరిగింది. ఉభయ దాతలుగా గంధల్ల కృష్ణయ్య అన్నపూర్ణమ్మ వ్యవహరించారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలు పట్టివేత

విశాలాంధ్ర-కొండాపురం: మండలంలోని ఇసుక దామర్ల పంచాయతీ పరిధిలో ఉన్న ఉప్పుటేరు వాగు నుండి ప్రకాశం జిల్లా కంబాలదిన్నె గ్రామానికి చెందిన ఐదు ట్రాక్టర్లు ఒక జెసిపిని శనివారం ఎస్సై మహేంద్ర తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నాడు వీరిపై కేసు నమోదు చేసి కోర్టు హాజరు పరిచినట్లు ఆయన తెలిపారు

తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లాకు శుభాకాంక్షలు

విశాలాంధ్ర- కందుకూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన గాజువాక శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావును శనివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు నెల్లూరు పార్లమెంటు తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుండి 2024 వరకు తెలుగుదేశం పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలిచిన వారిని, మే నెలలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం శాయశక్తుల శ్రమించిన వారిని గుర్తించి వారికి నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేసి విజ్ఞప్తి చేసినట్లు మోషే మీడియాకు తెలియజేశారు. స్పందించిన అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి నామినేటెడ్, పార్టీ పదవులలో సముచిత స్థానం కల్పిస్తామని చెప్పారని మోషే తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కలిసిన వారిలో ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోన ప్రతాప్ కుమార్ , ఉలవపాడు మండలం తెలుగుయువత కార్యనిర్వాహక కార్యదర్శి గడ్డం నవీన్ తదితరులు ఉన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా కోనేరు మార్కెట్

-చైన్ స్నాచింగ్ తరహాలో..మొబైల్ ఫోన్ దోపిడీ -వ్యాపార దుకాణాల వద్ద మాదకద్రవ్యాల సీసాలు

-రాత్రి అయితే ఆకతాయిల ఆగడాలు -హడలిపోతున్న ప్రజలు

విశాలాంధ్ర-నెల్లూరు టౌన్ : స్థానిక ఏసి సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ సమీపంలోని, (కోనేరు ప్రాంతం) వద్ద నిర్మిస్తున్న ఆకుకూరలు, పూలు, పండ్ల మార్కెట్ దుకాణాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని తీవ్రస్థాయిలో ఆరోపణలు ఉన్నాయి. నెల్లూరు నగరంలోని నడిబొడ్డు ప్రాంతం ఏసీ కూరగాయల మార్కెట్, కోనేరు వద్ద నిర్మిస్తున్న దుకాణాల సముదాయాల ప్రాంతం, ప్రతినిత్యం ప్రజలతో రద్దీగా ఉంటుంది. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు ఒకే చోట ప్రజలకు లభ్యమవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కోనేరు ప్రాంతం వద్ద దుకాణాల నిర్మాణాలు చేపట్టింది. సుమారు 150 నుంచి 170 దుకాణాల వరకు నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది. అందులో 90 శాతం దుకాణాలు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం నిర్మాణ దశలో ఉన్నాయని సమాచారం. ఆ దుకాణాలను పూర్తిస్థాయిలో నిర్మించి వ్యాపారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ దుకాణాలకు మరోవైపున ఖాళీగా ఉన్న ప్రాంతంలో కూరగాయలు, ఆకుకూరలను రైతులు, వ్యాపారులు ప్రజలకు విక్రయిస్తుంటారు. అటువంటి దుకాణాల సముదాయాల వద్ద రాత్రి అయితే ఆకతాయిల ఆగడాలకు అడ్డు, అదుపు లేకుండా పోయిందని అక్కడ రైతులు, వ్యాపారులు వాపోతున్నారు. ఆ దుకాణాల సముదాయాల వద్ద రాత్రిపూట ఆకతాయిలు మాదకద్రవ్యాలైన మత్తు పదార్థాలను, మద్యాన్ని సేవిస్తూ, ఇంజెక్షన్ల ద్వారా వినియోగిస్తున్నారని సమాచారం. ఆ విధముగా వినియోగించిన మత్తు పదార్థాల ద్రవ పదార్థాల బాటిళ్లు, మత్తుకు ఉపయోగించేవి (సీసాలు) ఆ దుకాణాల వద్ద దర్శనమిస్తుండడం భయాందోళనలకు గురి చేస్తున్నాయని అక్కడి వ్యాపారులు, రైతులు వాపోతున్నారు. గతంలోనూ వాహనాలు చోరీకి గురైనట్లు అక్కడ వ్యాపారులు తెలుపుతుండడం గమనార్హం. ఈ క్రమంలో గురువారం రాత్రి సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనం పై, ఆ దుకాణాల సముదాయాల వద్దకు వచ్చి, అక్కడ ఉన్న వ్యాపారి అత్తిపాటి వెంకటేశ్వర్లు వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను చైన్స్ స్నాచింగ్ తరహాలో దోచుకుని వెళ్లినట్లు సమాచారం. ఈ మొబైల్ దోపిడీ విషయమై విఆర్ సి సెంటర్లోని (చిన్న బజార్) పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు వెంకటేశ్వర్లు తెలిపారు. ఇటువంటి సంఘటనలు, అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పోలీసులు గట్టి నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని మార్కెట్ వ్యాపారులు, రైతులు కోరుతున్నారు.

చైన్స్ స్నాచింగ్ తరహాలో మొబైల్ లాక్కొని వెళ్లారు..

బాధితుడు (వ్యాపారి) అత్తిపాటి వెంకటేశ్వర్లు

బుచ్చిరెడ్డిపాలెం, సంఘం మండలం అనసూయ నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాను. కూర మామిడి కాయలను విక్రయిస్తుంటాను. గురువారం రాత్రి వ్యాపార నిమిత్తం కోనేరు మార్కెట్ ప్రాంత సమీపంలో వేచి ఉన్నాను. తోటి వ్యాపారులు కూత వేడు దూరంలో ఉన్నారు. అయినప్పటికీ ఇద్దరు యువకులు స్పీడుగా ద్విచక్ర వాహనంపై వచ్చి తన జోబులోనున్న ఎమ్ఐ మొబైల్ ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. తాను కేకలు వేసే సమయం కూడా ఇవ్వకుండా మెరుపు వేగంతో మొబైల్‌ను దోచుకుని వెళ్లిపోయారు. జరిగిన సంఘటనపై విఆర్‌సిసెంటర్ సమీపంలోని(చిన్న బజార్) పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాను. పోలీసులు జరిగిన సంఘటనపై నాకు న్యాయం చేసి, రక్షణ కల్పించండి ఆకతాయిల ఆగడాలను అరికట్టాలి..

కలివి సురేష్, కూరగాయల వ్యాపారి

కోనేరు మార్కెట్ సమీపంలో రాత్రి అయితే ఆకతాయిల ఆగడాలకు అడ్డు, అదుపు లేకుండా ఉంది. ముఖ్యంగా యువకులు మాదక ద్రవ్యాలైన మత్తు పదార్థాలను, మద్యాన్ని, ఈ దుకాణాల సముదాయాల వద్ద వినియోగిస్తుండడం భయాందోళనలకు గురిచేస్తుంది. కూరగాయలు, ఆకుకూరలను విక్రయించే రైతులు, వ్యాపారులు రాత్రిపూట మార్కెట్ కు చేరుకుంటారు. సుమారు మూడు గంటల సమయంలో సరుకు (కూరగాయలు, ఆకుకూరలు) విక్రయాలు సాగిస్తుంటారు. ఈ ఆకతాయిల వల్ల వ్యాపారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆకతాయిల నుంచి పోలీసులు రక్షణ కల్పించాలన్నారు.

'దిల్ సేకరోబాత్, భగవాన్కే సాథ్'

కాంపైన్ ను ప్రారంభించిన ఐటిసి మంగల్ దీప్

విశాలాంధ్ర-నెల్లూరు : భారతదేశపు ప్రీమియర్ అగర్ బత్తి బ్రాండ్ ఐటిసి మంగల్దీప్ తమ కొత్త, 'దిల్ సే కరో బాత్, భగవాన్ కే సాథ్' ను అనగా 'భగవంతుడ్ని మీకు సన్నిహితమైన వ్యక్తిగా చేయండి' అని అర్థం ఇచ్చే తమ కాంపైన్ ను ప్రకటించింది. ఈ విలక్షణమైన కాంపైన్ భగవంతునితో తమకు గల దైవిక సంబంధాన్ని సంబరం చేస్తుందని కాంపైన్ విడుదల గురించి ఐటీసీ మ్యాచెస్ అగరబత్తి బిజినెస్ ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ గౌరవ్ తయాల్ అన్నారు. ఇది మనస్ఫూర్తిగా సంభాషణలు చేసే ఇద్దరు సన్నిహిత వ్యక్తులమధ్య ఉన్న సంబంధంలాగామనుష్యులు భగవంతునికి మధ్య సంబంధాన్ని ఉదాహరిస్తుందన్నారు. ఈ కాంపైన్తో, బ్రాండ్ కొత్త స్థానం అనుసరి స్తుందనీ, దీనిలో విభిన్నమైన జీవితాలు, సంస్కారాలు,నమ్మకాలు, ఆద్యాత్మికత, భక్తిని వ్యక్తీకరించే మార్గాలుఉంటాయన్నారు. ఈ కాంపైన్ను లక్ష్య భరితమైన ప్రేక్షకులవద్దకు తీసుకువెళ్లడానికి, ఓగిల్వి ఇండియా ద్వారా చిత్రీకరించబడిన కొత్తయాడ్‌ను ఐటిసి మంగల్దీప్ విడుదల చేసిందన్నారు. ఈ కాంపైన్ గురించి ఓగిల్వి ఇండియాలో గ్రూప్ క్రియేటివ్ డైరెక్టర్ రాజేష్ మణి మాట్లాడుతూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, అరుణాచల్ ప్రదేశ్, కేరళ రాష్ట్రాల్లో 10 జులైన నుండి ప్రసారమయ్యే ఫ్లాగ్ షిప్ టీవీసీ విడుదల చేసిందన్నారు. ఈ కొత్త స్థానం గురించిప్రచారం చేయడానికి సోషల్మీడియా ఇన్ఫ్లుయెన్సర్కార్య

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకు ఎమ్మెల్యే ఇంటూరి

విశాలాంధ్ర-ఓలేటివారిపాలెం: మండలంలోని అయ్యో వారి పల్లె పంచాయతీలో శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి మాలకొండ దేవస్థానం పరిధిలో 9 కోట్లతో రిటైనింగ్ వాల్, కింది నుంచి పైకివెళ్లే మెట్లు అభివృద్ధి చేయడం, మెట్లు పైన రూఫ్ వేయడం తదితర అభివృద్ధి పనులు రెండేళ్లుగా సాగుతుండడంపై డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసరావును ఎమ్మెల్యే ప్రశ్నించారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. దేవస్థానం ఎదురుగా షాపులను అద్దెకు తీసుకున్న వ్యాపారులు, రోడ్లపైకి వచ్చి బల్లలు,షామియానాలు ఏర్పాటు చేయడాన్ని ఎమ్మెల్యే గమనించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా, వ్యాపారాలను రూములలో మాత్రమే చేసుకోవాలని దుకాణదారులకు సూచించారు. అలాగే ఖాళీగా ఉన్న దుకాణాలకు వేలంపాట నిర్వహించి అద్దెలకు ఇవ్వాలని అధికారులకు సూచించారు. శివాలయం పక్కన ఎత్తుగా ఉన్న మెట్లను సరిచేయడంతో పాటు పైన రూఫ్ వేయించాలని చెప్పారు భోజనప్రసాదం తయారుచేసే హాల్, డైనింగ్ హాల్, ఇతర ప్రాంతాలను కూడా ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రసాదం వడ్డించే విషయంలో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాని హర్ష గుర్రం మాల్యాద్రి ఓలేటి.నరసింహం కామినేని వీరయ్య పలువురు నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

ఏనుగుల వలన కలిగే పంట, ప్రాణ నష్టాల పరిహారం పెంచాలి

విశాలాంధ్ర-పలమనేరు: జిల్లాలో గత కొన్నేళ్లుగా ఏనుగులు వలన పంటనష్టాలతోపాటు ప్రాణనష్టాలు కూడా ఎక్కువగా జరుగుతూనే ఉన్నాయి వీటిని నివారించడానికి ప్రభుత్వాలు కానీ పాలకులు కానీ పట్టించుకోవడం లేదు ఏనుగుల వలన పంట ప్రాణ నష్టాలకు సంబంధించి నష్ట పరిహారం గురించి గత 2012 లో అప్పటి టిడిపి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఓను మళ్లీ 2014 వరకు పొడిగించింది ఆ జీఓను మార్చకుండా ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా ఈ జీఓ మాత్రం ఇంతవరకు మార్చలేదు . ఇప్పటివరకూ అనేక జీవోలను మార్చారు ఈ జీవోను మాత్రం ఇంతవరకు మార్చలేదు ప్రస్తుతం పంటపెట్టుబడులు బారీగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత పుట్టుబడులకు అనుగుణంగా మార్కెట్ రేటు ప్రకారం పంటలు వారీగా పెట్టుబడులకు అనుగుణంగా ఇప్పుడు ఉన్న జీఓకు మూడింతలుగా జీవోను ప్రవేశపెట్టి మనకు పక్కనున్న తమిళనాడు. కర్నాటక.కేరళ తదితర రాష్ట్రాలను పరిశీలించి అక్కడ ఇస్తున్న విధంగా మన రాష్ట్రంలో కూడా అమలు పరచాలని రైతులు బావిస్తున్నారు. ఎప్పుడో ఇచ్చిన పాత జీవోనే ఇప్పటికీ కొనసాగిస్తూ రైతులను నిరుత్సాహపరుస్తున్న జీవోను మార్చి ప్రస్తుత పంటపెట్టుబడులు బారీగాయి వాటికి అనుగుణంగా అన్ని పంటలకు పంటపెట్టుబడుల అంచనాలతో పంటల వారీగా మార్కెట్ రేటు ప్రకారం మన పక్క రాష్ట్రాలైన తమిళనాడు. కర్నాటక.కేరళ వంటి రాష్ట్రాలను అనుసరించి అక్కడ ఆ ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను అనుసరించి వాటికి అనుగుణంగా కొత్త జీవోను మన రాష్ట్రంలో కూడా వెంటనే ప్రవేశపెట్టాలనీ రైతునేతలు ఎప్పటినుంచో ఏళ్లతరబడి ప్రభుత్వానికి విన్న వేదిస్తూనే ఉన్నారు కానీ ప్రభుత్వం గానీ ప్రజా పాలకులు కానీ పట్టించుకోవడం లేదు. ఇకనైనా ఏనుగులవలన జరిగే పంట ప్రాణ నష్టాలు జరగకుండా పూర్తి స్థాయిలోవాటి నివారణ చర్యలు చేపట్టి పంటనష్టాని ఇచ్చే నష్ట పరిహారాన్ని మరింత పెంచి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోగిలేరు పంచాయతీలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

విశాలాంధ్ర-చిత్తూరు: కోగిలేరు గ్రామపంచాయతీలో సర్పంచ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ చర్యలు ముమ్మరంగా చేపట్టారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ పరిధిలోని కోగిలేరు, బసవరాజుకండ్రిగ, పొట్టగానిపల్లి, చీకలదిన్నేపల్లిలో మురుగునీటి కాలువలు శుభ్రం చేయించారు. అలాగే దోమలు వ్యాప్తి చెందకుండా మురుగునీటి కాలువలు, పేడదిబ్బలు, రోడ్లతో పాటు ఇంటింటి దగ్గర మలాథిన్ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ దోమల వలన డెంగ్యూ, టైఫాయిడ్, మలేరియా, చికెన్ గున్యా వంటి జ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ప్రజలు ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే వారానికి ఒక రోజు డ్రైడే పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మురళీకృష్ణ పాల్గొన్నారు. ఇక గ్రామంలో రాయలపేట ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఓ శ్రీను, ఆశా వర్కర్ లలిత, అంగన్వాడీ కార్యకర్త సునీత ఇంటింటికి తిరిగి జ్వరాలున్న వారిని గుర్తించి, రక్తనమూనాలను సేకరించి, మందులు పంపిణీ చేశారు.

మాజీ మంత్రి అమర నాథరెడ్డి సేవలు ఆదర్శనీయం

విశాలాంధ్ర-పీలేరు: స్వర్గీయ మాజీ మంత్రి నల్లారి అమరనాథరెడ్డి సేవలు ఆదర్శనీయమని, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కొనియాడారు. తన తండ్రి అమర నాద రెడ్డి 37వ వర్ధంతి సందర్భంగా కలికిరి పట్టణంలో రైతు మార్కెట్ యార్డ్ దగ్గర కిషోర్ కుమార్ రెడ్డి నేతృత్వంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఆయన మాట్లాడుతూ వాయల్పాడు నియోజకవర్గం నుండి 1962 తొలిసారిగా ఇండిపెండెంట్ ఎమ్మెల్యే గా పోటీ చేసి విజయం సాధించారని అన్నారు. ఆ క్రమంలోనే 1972, 1978, 1985లలో కూడా అదే నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి గెలుపొంది,మొత్తం నాలుగు సార్లు శాసన సభ్యులుగా ఎన్నిక య్యారని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు మర్రిచెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకట్రామిరెడ్డి హయాంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా తన రాజకీయ ప్రయాణం కొన సాగించారని అన్నారు. పీలేరు నియోజకవర్గ స్థాయిలో టీడీపీ బిజెపి, జనసేన శ్రేణుల ఆధ్వర్యంలో ఘన నివాళు లర్పించారు. అనంతరం కలికిరి రైతు మార్కెట్ యార్డ్‌లో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, బిజెపి, జనసేన, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

వైభవంగా బాల గుర్రప్పస్వామి బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

విశాలాంధ్ర - తిరుపతి: చిన్నగొట్టిగల్లు మండలం, చిన్నగొట్టిగల్లు పంచాయతీ లంకిపల్లివారిపల్లి గ్రామంలో ఈనెల 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు వైభవంగా శ్రీ బాల గుర్రప్ప స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాలకు చంద్ర గిరి ఎమ్మెల్యే పులివర్తి నానిని చిన్నగొట్టిగల్లు మండల ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ పెద్దలు ఆహ్వానించారు. వీరి ఆహ్వానం మేరకు ఎంఎల్ఏ శనివారం సాయంత్రం శ్రీ బాల గుర్రప్ప స్వామివారి ఆలయానికి చేరుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మె ల్యే పులివర్తి నానికి మండల కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. మేళ తాళాలతో, మంగళ వాయిద్యాలతో, మహి ళలు మంగళహారతులతో, యువత తపాకా యలు కాలుస్తూ ఆలయ పూజారులు పూర్ణకుంభంతో పులివర్తి నానికి ఘన స్వాగ తం పలికారు. ఆలయ కమిటీ సభ్యులు పూజారితో పులివర్తి నానికి తలపాగా చుట్టి కండువా కప్పి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ పూజారి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి ఐదు కలిశాలకు ప్రత్యేకంగా కలిశాలను అలంక రించి పూజలు నిర్వహించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీశ్రీశ్రీ బాల గుర్రప్ప స్వామి, అంకమ్మ, వెంకటేశ్వర స్వామి, ఓరుగంటి ఎల్లమ్మ, సుబ్రమణ్యం స్వామి ఐదుగురు దేవతామూర్తులను కలిశా లతో ప్రతిష్టించి బ్రహ్మోత్సవాలు నిర్వహి స్తారు. భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వ హిస్తారు. అటువంటి పవిత్రమైన రోజు దర్శనం చేసుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని పులివర్తి నాని తెలిపారు. ఆలయ అర్చకులు పులివర్తి నానికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ బ్రహ్మోత్సవాలలో ఎమ్మెల్యే వెంట ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, అభిమానులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

విశాలాంధ్ర-సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు త్రాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న సూళ్లూరుపేట శాసన సభ్యురాలు డాక్టర్ నెల విజయ్ శ్రీ శనివారం కొండేపాటి గంగా ప్రసాద్ సహకారంతో ట్యాంకర్ల ద్వారా గురు కుల పాఠశాల బాలికలకు తాగునీరు అందజేశా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె కోరారు. ఈ సందర్భం గా వార్డెన్ మాట్లాడుతూ కరెంటు పోయినప్పుడు విద్యార్థులకు చదువుకునేందుకు ఇబ్బందిగా ఉందని ఎవరన్నా దాతల సహాయంతో జనరేటర్ను, లేక ఇన్వర్టర్ అందజేయవలసిం దిగా శాసనసభ్యుల్ని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తప్పకుండా దాతలతో మాట్లాడి వారికి జనరేటర్ ఏర్పాటు చేస్తామ న్నారు. అలాగే ప్రతి దినం నాలుగు ట్యాంకర్లు మంచినీరు సరఫరా చేస్తామని ఎమ్మెల్యే తెలిపా రు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, కార్యదర్శి ఎజి కిషోర్, తెలుగుదేశం పార్టీ నాయకులు పిట్ల సుబ్రహ్మ ణ్యం, అలవల శ్రీనివాసులు, వాగి చర్ల రమేష్, మేడా సాయి, మాధవ నాయుడు, అలీ భాయ్, రాజ సులోచనమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమించిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర-మదనపల్లి: రెండవ శనివారం అయినందున మదన పల్లి పట్టణంలోని ప్రభుత్వ నిబం ధనలను అతిక్రమించి నడుపుతు న్న విద్యాసంస్థలకు వెళ్లి ఏఐఎస్. ఎఫ్ఐ ఆధ్వర్యంలో సెలవు ఇప్పిం చడం జరిగింది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మాధవ్, జిల్లా కార్యదర్శి నరసిం హ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధన లను అతిక్రమిస్తూ ప్రవేట్ పాఠ శాలలు మరియు కళాశాలలు సెలవు దినాలలో కూడా విద్యాసం స్థలను నడిపిస్తూ విద్యార్థులను ఒత్తిడికి గురిచేస్తూ వారి ప్రాణాలు తీసే వరకు తీసుకెళ్తున్నారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

ఈనెల18 నుంచి ఆగష్టు 2 వరకు కుష్టువ్యాధి పక్షోత్సవాలు

విశాలాంధ్ర-మదనపల్లి: కుష్టువ్యాధి నిర్మూలనకు అందరూ కృషి చేయాలని మదనపల్లె సర్వజన బోధనాస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజు తెలిపారు. శనివారం బోధనాస్పత్రిలో కుష్టువ్యాధి పక్షోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మెడికల్ సూపరింటెండెంట్ కుష్టు వ్యాధి లక్షణాలను వివరించారు. చర్మంపై స్పర్శలేని, నొప్పి లేదా దురద లేని మచ్చలు, చర్మంపై ఎర్రని లేదా రాగి రంగు మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, కనుబొమ్మల మరియు కనురెప్పల వెంట్రు కలు రాలిపోవడం లక్షణాలు ఉంటే కుష్టు వ్యాధికి గురవుతున్నట్లు గుర్తించాలన్నారు. ఇంకా నొప్పిగా ఉన్న నరములు, చేతులు, పాదాలు, నరాలయందు తిమ్మిర్లు కలిగి ఉండడం, అరిచేతులు, కాళ్ళు పాదాలు స్పర్శలేకపోవడం మరియు పొడిబారిపో వడం, చేతులు, పాదాలయందు నొప్పి తెలియని గాయాలు లేదా పుండ్లు కూడా వ్యాధి సంభవించే ముందు కలిగే లక్షణా లని తెలిపారు. చేతివేళ్ళు, కాలివేళ్ళు వంక ర్లు తిరిగి అంగవైకల్యం రావడం, చల్లని లేదా వేడి వస్తువులు గుర్తించలేకపోవడం, చేతుల నుండి వస్తువులు జారిపోయి మణికట్టు లేక మడమను పైకి లేపలేకపో వటం వంటి లక్షణాలు కూడా ఉండవచ్చని తెలిపారు. అంగవైకల్య నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎండిటి చికి త్సతో కుష్టు వ్యాధి పూర్తిగా నయమగుతుం దని తెలిపారు. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో కుష్టువ్యాధి చికిత్సకు మందులు ఉచితంగా అందజేస్తారన్నారు. ఈ నెల 18 నుంచి వైద్య సిబ్బంది గడప, గడపకు వెళ్లి కుష్టువ్యాధి లక్షణాలు ఉన్నట్లయితే గుర్తించాలన్నారు. ప్రజల్లో వ్యాధిఇ లక్షణాలపై, చికిత్సల గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో డిపిఎంఒ వేణుగోపాల్, ఆర్ఎంఒ డాక్టర్ ప్రసాద్ రాజు, నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మంజు, నాగశ్రీ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఐఐటి పెండింగ్ పనుల పరిష్కార దిశగా చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర -తిరుపతి : కేంద్ర విద్యా సంస్థ అయిన ఐఐటిని జెసి ధ్యానచంద్రతో కలిసి సందర్శించి పెండింగ్ పనుల వివరాలు తెలుసుకుని త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు.శనివారం మధ్యాహ్నం ఏర్పేడు వద్ద గల కేంద్ర విద్యాసంస్థ ఐఐటి ని కలెక్టర్ గారు జెసి తో కలిసి సందర్శించగా ప్రొఫెసర్ డా. కే.ఎన్. సత్యనారాయణ క్యాంపస్ పురోగతిపై వివరించారు. కలెక్టర్ పలువివరాలు తెలుసుకుని, పెండింగ్ అంశాలను భూ సంబంధిత మరియు ఇతర సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డైరెక్టర్ కు తెలిపారు.ఈ సమావేశంలో ఐఐటి డిప్యూటీ రిజిస్ట్రార్ చమన్ మెహతా, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు అంశాలపై

కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-తిరుపతి: రేణిగుంట **ఎయిర్‌పోర్టుకు** సంబంధించిన పలు అంశాలపై రేణిగుంట విమానాశ్రయం నందు జెసి ధ్యాన చంద్ర తో కలిసి సమీక్షించి పలు అంశాలపై అధికారులకు జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పలు సూచనలు చేశారు.శనివారం కలెక్టర్ రేణిగుంట విమానాశ్రయం నందు ఎయిర్పోర్ట్ కు సంబంధించిన పెండింగ్ భూ సంబంధిత అంశాలపై, ఎలక్ట్రిక్ లైన్ తదితర పెండింగ్ అంశాలపై కలెక్టర్ జెసి తో కలిసి ఎయిర్పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాస రావు, ట్రాన్స్కో తదితర అధికారులతో సమీక్షించి అధికారులకు పరిష్కార దిశగా పలు సూచనలు చేశారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్, శ్రీకాళహస్తి ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, ట్రాన్స్ కో అధికారులు, కేఈజ సంస్థ ప్రతినిధులు, జి సెక్షన్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎయిర్పోర్ట్ సివిల్, ఆపరేషనల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అపోలో ఆసుపత్రిలో రోబోటిక్ థొరాసిక్ సర్జరీ

విశాలాంధ్ర -తిరుపతి : అపోలో ఆసుపత్రిలో ఆధ్యాధునిక రోబోటిక్ థొరాసిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెన్నై అపోలో హాస్పిటల్ రోబోటిక్ థొరాసిక్ సర్జరీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ అజయ్ నరసింహన్ తెలిపారు. శనివారం స్థానిక లక్ష్మీపురం సర్కిల్లోని అపోలో ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోబోటిక్ థొరాసిక్ సర్జరీ భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో ఒక గొప్ప పురోగతిని సూచించడమే కాక సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో మరింత ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. అందులో భాగంగానే మారుతున్న టెక్నాలజీని దృష్టిలో ఉంచుకొని అపోలో హాస్పిటల్ మరో అడుగు ముందుకు వేయడం జరిగిందన్నారు.రోబోటిక్ సర్జరీ ద్వారా కచ్చితతత్వం,కనిష్ట ఇన్వాసివ్ నెస్,మెరుగైన ఫలితాలు అందిస్తాయన్నారు. థొరాసిక్ సర్జరీలు అవసరమయ్యే రోగులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పూర్తి సురక్షితమైన వైద్యం అందించగల మన్నారు.ఈ రోబోటిక్ థొరాసిక్ సర్జరీ అనేది ఊపిరితిత్తులు,అన్నవాహిక, మెడియాస్టినమ్, ఇతర నిర్మాణాలకు సంబంధించిన ఛాతీ,థొరాసిక్ కేవిటీలో ప్రక్రియలను నిర్వహించడానికి ఉపయోగించే అతి తక్కువ హానికర శస్త్రచికిత్సా విధానం. ఈ సర్జికల్ టెక్నిక్ రోబోటిక్ టెక్నాలజీ యొక్క ఖచ్చితత్వాన్ని,శిక్షణ పొందిన సర్జన్ నైపుణ్యాలను మిళితం చేసి వివిధ థొరాసిక్ పరిస్థితులను పరిష్కరించడమే కాక తక్కువ హానికర,అత్యంత ఖచ్చితమైన పద్ధతిని అందిస్తుందని తెలిపారు. అంతేకాక ఊపిరితిత్తుల క్యాన్సర్,ఇతర ఊపిరితిత్తుల పరిస్థితులకు చికిత్స చేయడానికి ఈ విధానాలు ఎంతో కీలకమైనవని తెలిపారు.

వైభవంగా శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవం

ఆలయానికి తీసుకువస్తారుఈ సందర్భంగా టీటీడీ అన్నమాచార్య

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీనివాసమంగాపురం శ్రీకల్యాణవేంకటేశ్వర స్వామి పార్వేట ఉత్సవం శ్రీవారి మెట్టు సమీపంలో శనివారం అంగరంగ వైభవంగా జరిగింది.ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేరుకుంది. అక్కడ క్షేమతలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వ హించారు. ఇందులో దుష్టశిక్షణ కోసం ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. భజన బృందాలు భజనలు, కోలాటాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేక శ్రేణి డెప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్, సూపరింటెండెంట్లు చెంగల్రాయలు, వెంకట స్వామి, టెంపుల్ ఇన్స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

జూలై 16న శ్రీవారి ఆలయంలో

బ్రేక్ దర్శనాలు రద్దు

విశాలాంధ్ర- తిరుమల : తిరుమల శ్రీవారి ఆలయంలో జూలై 16న సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో జూలై 16న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా జూలై 15వ తేదీ సిఫారసు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని కోరడమైనది.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఘన స్వాగతం

విశాలాంధ్ర-తిరుపతి: తిరుమల తిరుపతి రెండు రోజుల పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం 5.00 గంటలకు రేణిగుంట విమానాశ్రయం కు చేరుకున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కు ఘనంగా స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్. జిల్లా జాయింట్ కలెక్టర్ ధ్యాన్ చంద్ర, నగరపాలక సంస్థ కమిషనర్ అతిథి సింగ్, డి ఆర్ ఓ పెంచల్ కిషోర్, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ల్యాండ్ అండ్ ప్రొటెక్షన్ సెల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డిఓ శ్రీకాళహస్తి రవిశంకర్ రెడ్డి తదితరులు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

తెలుగు భాషా రక్షణకు సమిష్టి కృషి అవసరం

విశాలాంధ్ర - పలమనేరు : తెలుగు భాషా రక్షణకు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఆయన తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరం ను సందర్శించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాతృభాషల రక్షణకు పార్లమెంటు వేదికగా కృషి చేస్తామన్నారు తెలుగు భాషా ఔన్నత్యాన్ని భావి తరాలకు అందించటానికి కృషి చేస్తున్న తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సభ్యులను అభినందించారు.సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసినాథంనాయుడు,పుష్ప లు ఎంపీ నీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలోగురుమూర్తి, ఉమ,పూసలరవి,శ్రా వణి,గిరి,గీతాంజలి,సుబ్రమణ్యం పాల్గొన్నారు

చిత్తూరు కమిషనర్‌ను సస్పెండ్ చేయాలి

- సిపిఐ జిల్లా కార్యదర్శి డిమాండ్

విశాలాంధ్ర -చిత్తూరు : చిత్తూరు నగరపాలక సంస్థలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడిన నగరపాలక కమిషనర్ డాక్టర్ జె.అరుణను వెంటనే సస్పెండ్ చేయాలని సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ కమిషనర్ ఇంత పెద్ద ఎత్తున అవినీతికి, అక్రమాలకు పాల్పడలేదన్నారు. టిడిపి పార్టీ అవినీతి రహిత పాలన అందిస్తామని చెప్పడంతోనే ప్రజలు ఓటు వేసి గెలిపించా లన్నారు. మీడియా ద్వారా కమిషనర్ అవినీతి భాగోతాలు వస్తున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే ఎందుకు ఉపేక్షిస్తున్నారు అని సూటిగా ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో విచారణ జరిపి బదిలీ చేయడం కాదు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో చిత్తూరు, తిరుపతి జిల్లాలో దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
తిరుపతి సిటీ, వడమాలపేట, నగరి, నాగలాపురం, డక్కిలి, ఐరాల, రామచంద్రాపురం, సదుం, యాదమరి, వరదయ్యపాళెం బంగారుపాలెం, రొంపిచెర్ల, పూతలపట్టు, శాంతిపురం, గుడుపల్లె
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 9490952134